# కుక్క

అనగా అనగా ఒక కుక్క. బుద్ధి తెలిసినప్పటినుంచీ దానికి ఎవరో ఒక యజమాని వుంటూనే వున్నాడు. తనకొక తల్లీ, తోబుట్టువులు ఉన్న సంగతి దానికి జ్ఞాపకం లేదు గాని యజమానులుండటం మటుకు దానికి బాగా జ్ఞాపకం.

అది పుట్టిన వేళావిశేషం ఏమిటోగాని దాని జాతకం తాలూకు మహాదశ, అంతర్దశ, విదశలను బట్టి అది కొద్దివాళ్ళ దగ్గిరా, గొప్పవాళ్ళదగ్గిరా కూడా ఉన్నది. అసహాయ స్థితిలో దాన్ని క్షుద్రులు చేరదీసి మెడకు నులకతాడో, నవారు పట్టీయో కట్టి గుడిసెలముందరా, కుళ్ళు కొంపల్లోనూ కట్టేసిన రోజులున్నై. అదృష్టం మారి అదే కార్లలో ఎక్కితిరిగింది. పరుపులమీద పడుకున్నది. మెడలో ఖరీదైన పట్టీలు, లైసెన్సుబిళ్ళలూ ధరించి రాజభోగంగా తిండి తిని, పచ్చిక బయళ్ళమీద దొర్లి ఆడుకున్న రోజులూ ఉన్నై. ఒకప్పుడు మునిసిపాలిటీ వాళ్ళు దాన్ని పట్టుకుని యమలోకానికి పంపినంత పని కూడా అయింది.

"మన చేతిలో ఏమీలేదు. అంతా గ్రహబలం!" అనుకున్నది కుక్క. అయితే దాని కుక్కబుద్ధికి కూడా ఒక విషయం తెలిసివచ్చింది. అదేమిటంటే, కుక్క జీవితానికి మంచి రోజులు వచ్చినా అవి శాశ్వతం కావు. చెడ్డరోజులు వస్తేమటుకు అవి మారటం బహుకష్టం. అందుచేత బుద్ధిగల కుక్క తన అదృష్టాన్ని చూసి విర్రవీగరాదు; దురదృష్టానికి విచారించి ఆట్టే లాభమూ లేదు.

తన యజమానులు కొద్ది వాళ్ళయినా, గొప్పవాళ్ళయినా ఒక విషయంలో మాత్రం తేడా కనిపించలేదు కుక్కకి. యజమాని తాలూకు చంటిపిల్లల దగ్గిర్నుంచీ అందరూ తన మీద అధికారం చలాయించేవారే. ఈ పరిస్థితికి కుక్క అయిన ప్రాణి తల ఒగ్గక వీలులేదు.

తన దీర్ఘజీవితంలో కుక్క నేర్చుకున్న మరో విషయమేమంటే, కుక్కలకు స్వతహాగా ఏమీ తెలీదు. వాటికి యజమాని హృదయం అర్థం కావటం కష్టం. అందుచేత అవి తరుచు తన్నులూ తిట్లూ తింటై. కుక్క సదుద్దేశాలు ఎందుకూ పనికిరావు. రెండు మూడు సార్లు కుక్క అర్ధరాత్రివేళ అనుకోకుండా ఇంటికొచ్చిన యజమానిని చూసి ఆనందంతో అరిచి తన్నులు తిన్నది. యజమాని ఇంటికొచ్చిన పెద్ద మనుషులను చూసి, యజమానికి

శత్రువులని పొరబడి అరిచి, ఎన్ని చివాట్లూ, చెప్పుదెబ్బలూ తిన్నదో లెక్కేలేదు. తంతారంటే యజమానుల తప్పా, అజ్ఞానానికి అనుభవించక తప్పుతుందా ఏమిటి? అయితే చిక్కేమిటంటే ఎంత తెలివిగా ఆలోచించినా కుక్కలకు జ్ఞానమనేది లభించే అవకాశం లేదు. భగవంతుడు కుక్కల్ని అట్లా పుట్టించాడు మరి!

ఈ అజ్ఞానం మూలంగానే కుక్కలు దేశకాలపరిస్థితుల కనుగుణంగా మారలేకపోతాయి. ఇందువల్ల చాలా నష్టం ఉంది. ఒకప్పుడు ఒక యజమాని తను బాగా అరుస్తుందని మెచ్చుకునేవాడు. తను అరిచే కదా రెండుసార్లు దొంగలను పట్టించింది? కాని కొందరు యజమానులకు అది ఇష్టంలేదు. తనను కొద్ది రోజులు కారులో తిప్పిన యజమానికి తన గొంతే గిట్టేదికాదు.

"మంచి కుక్క ఎట్లా ఉండాలి? అసలు కుక్క వున్న సంగతే దొంగకు తెలియనివ్వరాదు. దొంగ దగ్గిరదాకా వచ్చాక ఏ కాలో పట్టుకుని, కత్తిపెట్టి పొడిచినా విడవరాదు. అరిచేకుక్క కరవనేరదు" అని ఆయన తన స్నేహితులతో అంటూండగా కుక్క విన్నది.

"అబ్బో కొన్ని కుక్కలు మనిషికన్న కూడా గొప్పవి" అంటూ ఆయన స్నేహితులు, యజమానుల కోసం ప్రాణాలిచ్చిన కుక్కల కథలు చెప్పారు. కుక్కజాతిలో అటువంటి గొప్ప కుక్కలుంటాయని విని చాలా గర్వం కలిగింది గాని, తానెన్నడూ ఏ యజమాని కోసమూ ప్రాణాలు విడవనందుకు కుక్క చింతించింది.

ఆదర్శవంతమైన కుక్క తన సహజ ప్రాణాలు చంపుకుని యజమాని స్థాయికి తగ్గట్టు సంచరించాలి. కొన్ని రకాల జాతి కుక్కల్ని చూస్తే మన కుక్కకి వళ్ళుమండుకొచ్చేది. ముఖ్యంగా కళ్ళూ మొహమూ బొచ్చుతో మూసుకుపోయిన జూలుకుక్కలను చూస్తే దానికి వాంతి వచ్చినంత పని అయేది. ఇందుకుగాను దానికి ఒకసారి ప్రాయశ్చిత్తం జరిగింది. ఊరకుక్కలతో స్నేహంచేసి "భాయి, భాయి" అన్నందుకు కూడా దానికి శిక్షయింది. ఇటువంటి విషయాలలో కుక్కలు యజమానుల సంస్కృతికి అవమానం కలిగించి పతనమవుతాయి.

కుక్క విశ్వాసంగల జంతువన్నది లోకమెరిగిన విషయం. ఆ ఒక్క గుణాన్ని బట్టే అది సాహిత్యంలోకి కూడా ఎక్కగలిగింది. దానిమీద గొప్పవాళ్ళు కథలు రాశారు, పద్యాలు రాశారు. కుక్కలు ఈ బిరుదు దక్కించుకునేందుకుగాను మిగిలిన అన్ని వివేచనలూ వర్జించాలి. తన యజమాని విశ్వాసపాత్రుడా, కాదా; ఈ విశ్వాసం వల్ల తనకు ప్రయోజనం ఉన్నదా, లేదా; ప్రపంచంలో ఈ గుడ్డి విశ్వాసం తప్ప ఇంకే సద్గుణమూ లేదా ఇత్యాది ప్రశ్నలు మంచికుక్కకి కలగరాదని మన కుక్కకు తెలుసు. అందుచేత తన యజమానులను

అది కల్తీలేని విశ్వాసంతో కొలుస్తూ, అవసరమైతే సాటి కుక్కలపట్ల బద్ధశత్రువుగా కూడా ప్రవర్తించేది. దాని కళ్ళు అనుక్షణం యజమాని మీదే ఉండేవి. యజమాని సంతోషంగా ఉన్నాడా, కోపంగా వున్నాడా, చిరాకుగా వున్నాడా, వుత్సాహంగా వున్నాడా అన్నది క్షణంలో కనిపెట్టి అతని మనోవైఖరి కనుగుణంగా తాను ఆంగికాభినయం చేసేది.

తన విధులను తాను నిర్వర్తించుకు పోవటంలో కుక్క సామాన్యంగా యజమానిచేత చెప్పించుకొనటమంటూ వుండేది కాదు. అందుచేత ఒక్కొక్కప్పుడు కుక్కకి తాను స్వేచ్ఛా జీవిననే అపోహ కలిగేది. కాని ఉన్నట్టుండి కణత పగలడమూ, తాను అనుకున్నంత స్వేచ్ఛా జీవిని కానేమోనని కుక్కకు అనుమానం కలగడమూ, కాకపోయినా తనకు స్వేచ్ఛతో ఏంపని అని తనని తాను సమాధాన పరుచుకోవటమూ జరుగుతూండేది.

అన్ని కుక్కల్నీ భగవంతుడే సృష్టించినా, అన్నీ ఒకే సంస్కృతిలో పెరగవన్నది నిర్వివాదాంశం. కొన్ని కుక్కలు ముఖ్యంగా అలగాజనం పెంచేవి పొగరుబోతుగానూ, ఎవర్నీ లెక్కచేయకుండానూ ఉంటాయి. ఈ సంగతి మన కుక్క గమనించింది. ఒక చాకలి వాడింట ఒక నల్లకుక్క వుండేది. దానికి చాకలివాడు అలుసిచ్చి పాడుచేసేడు. ఒక్కొక్క సారి ఆ అనాగరికుడు తన కడుపు కాల్చుకుని దానికి అన్నం పెట్టేవాడు! ఇక అది ఒకరి మాట ఎందుకు వింటుందీ? వాడెక్కడికి పోతే అదీ అక్కడికి పొయ్యేది. అసలు అదే దారి తీసేది. యజమాని చెప్పినట్టు చేసేదికాదు. మధ్య మధ్య యజమానిని కోప్పడేది. "నువ్వెప్పుడూ ఇంతే! నీకేం తెలీదసలు!" అనేది. ఆ పిచ్చిముండా కొడుకు నవ్వి "ఏందే నీసొదా?" అనేవాడు. అట్లా హద్దు మీరిపోయిన కుక్కలు కొన్ని ఉండటం మన కుక్క గమనించింది. వాటి స్వాతంత్ర్య ప్రియత్వం అర్థమయేది కాదు. అటువంటి కుక్కలకు ఒకటే శిక్ష - మునిసిపాలిటీ వాళ్ళకి అప్పగించడమే! అదీ అయిందిగా! ఒకళ్ళింట్లో ఒక కుక్క ఉండేది. ఇంటి నిండా పిల్లలు. పిల్లలన్న తర్వాత ఏదో ఒకటి చేయకుండా ఉంటారా? వాళ్ళు దాన్ని తోకలాగీ చెవుల్లాగీ ఆడుకునేవాళ్ళు. అంత మాత్రానికే కరవాలా? కరిచింది! వెంటనే దాన్ని యజమాని మునిసిపాలిటీ వాళ్ళకు అప్పగించాడు. రోగం తంగిన కుదిరింది. లేకపోతే కుక్కకి అంత అహంకారమా!

అయితే వయస్సు పైబడుతున్న కొద్దీ కుక్కకి ఏదో అసంతృప్తి కలగసాగింది. తను చాలాకాలం బతికింది. ముసలితనం పైబడుతోంది. రోజులు గడ్డుగా ఉన్నాయి. తనపై అనురాగం చూపించే వాళ్ళులేరు. పేరుకు తనకో యజమాని ఉన్నాడు గాని, తనకన్న ఉన్నత స్థానంలో ఇంకో కుక్క ఉన్నది. తనని తలిచేవాళ్ళులేరు. ఒక్కొక్కపూట తనకు తిండి వెయ్యటం కూడా మరిచిపోతారు. తాను ఎవరికంటబడినా వారి ముఖం మటమట లాడుతుంది. "శని" "పీడ" అనే మాటలు తనపట్ల విరివిగా వాడతారు.

అందుకే తాను సాధ్యమైనంత వరకు గోడమూలకు పోయి చుట్టచుట్టుకు పడుకుని ఈ జీవితం గురించీ, దాని అంతరార్థం గురించీ ఆలోచిస్తుంది. ఎంత దీర్ఘంగా ఆలోచించినా చివరకు ఒకటే ప్రశ్న: తాను ఇంతమంది యజమానులను ఇంత విశ్వాసంతో కొలిచింది కదా, చివరకు మిగిలిందేమిటి? తనకు చరిత్ర లేదు. తాను చేసిన ఘనకార్యాలను స్మరించేవారు లేరు. తానింకా బతికి ఉండగానే తన జీవిత వివరాలు మాసిపోయాయి! తననిప్పుడు చూస్తే తానొకప్పుడు ఎంత వైభవంగా బతికిందో ఎవరూహించగలరు?

కాలం మారుతోంది. కుక్కల బతుకు అభివృద్ధి అవుతున్నట్టు కనబడుతోంది. నమ్ము నమ్మకపో, ఒక కుక్క స్వయంగా విమాన ప్రయాణం చేసింది; ఇంకో కుక్క సినిమాలలో నటించింది! కాని ఏం లాభం? యజమానుల బతుకులో అభివృద్ధిచూసి కుక్కలు మురిసిపోవడమేగాని వాటి బతుకు పర్యవసానం ఎప్పుడూ ఒకటే. ఒకప్పుడు కారు షికార్లు చేసినందుకు తాను మురవలా? ఏమిటో! లోకం ఎంతమారినా ఈ కుక్క జన్మ మారేది లేదు. ఇది ఇంతేననుకున్నది కుక్క.

***మొదటి ముద్రణ: విశాలాంధ్ర, 1 అక్టోబర్ 1954***